సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 5 । మార్చి । 2023



శ్రీవారికి వెండి వస్తువులు


రాయవరం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయానికి బొడ్డు కాశీవిశ్వనాథం, రమేష్, సబ్బుశెట్టి రాజ రాజేశ్వరిలు శనివారం వెండి సామగ్రిని ఆలయ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డికి అందజేశారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి శనివారం యర్రా సన్యాసినాయుడు, వంశీ వినోద్ కుమార్ (జగన్నాథపురం) రూ.1,11,116 విరాళాన్ని ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు అందజేశారు.

డెల్టాలకు నీరు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శనివారం7,740క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2370,మధ్య డెల్టాకు 1600,పశ్చిమ డెల్టాకు 3770 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత అమరేంద్రనాథ్ చౌదరికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం లేళ్ల ఏడుకొండలు (కృష్ణాజిల్లా), పాకలపాటి అమరేంద్రనాథ్ చౌదరి (ద్వారకాతిరుమం) రూ 1,01,116 వంతున, ఎం.జగన్నాథరావు(హైదరాబాద్) రూ.50వేలు విరాళంగా అందజేశారు.

జాబ్‌మేళాలో ఉద్యోగావకాశాలు

సీటీఆర్ఐ: జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వికాస కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి 48 మంది హాజరు కాగా 16 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శనివారం ఈ వికాస కేంద్రంలో బహుళజాతి, స్థానిక ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారానికి జిల్లా వికాస కేంద్రం రిసోర్స్ పర్సన్ సత్యనారాయణను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 83090 10013కు ఫోన్ చేయవచ్చన్నారు.

98.71 శాతం పింఛన్ల పంపిణీ



పింఛను అందజేస్తున్న వలంటీర్ కృపాజ్యోతి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వైఎస్సార్ పింఛను కానుక పథకం ద్వారా 98.71 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్ట్ డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు. 2,36,251 మందికి పింఛన్ల సొమ్ము ఇవ్వాల్సి ఉండగా 2,33,215 మందికి అందజేశామన్నారు. రూ.65.11 కోట్లకుగాను రూ.64.27 కోట్లు అందించామని తెలిపారు. ఆదివారం సాయంత్రానికి మిగిలిన వారందరికీ అందజేయిస్తామన్నారు.

వాణిజ్య శాస్త్ర అధ్యాపకులకు శిక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధి గోదావరి రాజు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ అటానమస్ కళాశాల పరిధిలో వివిధ కళాశాలల వాణిజ్యశాస్త్ర అధ్యాపకులకు మూడు రోజుల పాటు జరిగే రెసిడెంట్ ట్రెనింగ్ శనివారం ప్రారంభమైంది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధి గోదావరి రాజు హాజరై శిక్షణ ప్రారరంభించారు. కళాశాల విద్యాశాఖ, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల మధ్య అవగాహన ఒప్పందం నేపథ్యంలో రాష్ట్రంలోని మూడు కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమం జరుగుతోందని ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ తెలిపారు. కొత్త జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కళాశాల విద్యాశాఖ ఈ శిక్షణ ఏర్పాటు చేసిందన్నారు.

ఈ అవకాశాన్ని అధ్యాపకులు వినియోగించుకోవాలన్నారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆన్‌లైన్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ ఎంఆర్ గౌతమ్, డాక్టర్ నరసారెడ్డి పాల్గొన్నారు.





వర రింగు బుట్టలను పరిశీలిస్తున్న మిజోరాం రాష్ట్ర గవర్నర్ **కంభంపాటి హరిబాబు, మంత్రి అమర్నాథ్ తదితరులు**



వర రింగు బుట్టలను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, **ప్రభుత్వ విప్ ధర్మశ్రీ తదితరులు**

పిచ్చుకపై ప్రేమాస్త్రం

- ధాన్యపు తోరణాలు, కుంచులు ఏర్పాటు
- పాత సాంప్రదాయం ద్వారా ఆహారం
- అంతరిస్తున్న పక్షుల మనుగడకు దోహదం
- రిటైర్డ్ టీచర్ దాలినాయుడు ఔదార్యం

సండే స్పెషల్

తుని రూరల్: అంతరించిపోతున్న పిచ్చుకల జాతి సంరక్షణకు నడుం బిగించారో విశ్రాంతి ఉపాధ్యాయుడు. భావితరాలకు తెలిసేలా పూర్వపు సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారీయన. గుళ్లు, గోపురాలు, పాఠశాలలు, ప్రముఖుల ఇళ్లల్లో వరి తోరణాలు, కుంచులను ఏర్పాటు చేస్తున్నారు. హరిత వికాస్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థుల, పర్యావరణ ప్రేమికులతో కలసి పుష్కర కాలంగా ఈ సేవలో నిమగ్నమయ్యారు. మొక్కలు నాటడం, వరి కంకులను కుంచులుగా, తోరణాలుగా మలిచి పక్షులకు ఆహారాన్ని అందిస్తున్నారు పోలుపర్తి దాలినాయుడు మాస్టారు. తునికి చెందిన ఈయన రెండేళ్ల కిందట తొండంగి స్కూలులో రిటైరయ్యారు. తునిలో స్థిరనివాసమేర్పరుచుకున్నారు. దాలినాయుడుకు పక్షులంటే వల్లమాలిన అభిమానం. సాంకేతికత, ఆధునీకరణ నేపథ్యంలో పిచ్చుకల మనుగడ కనుమరుగవుతోందనే ఆవేదనతో పన్నెండేళ్ల క్రితం హరిత వికాస్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు.

ఇలా తోరణాలు, కుంచెలు

సాధారణంగా వేసవిలో పక్షులకు ఆహార కొరత ఉంటుంది. ఇదే సమయంలో ఆడ, మగ పిచ్చుకలు గూళ్ల ఏర్పాటు చేసుకుని గుడ్లు పెడతాయి. సంతానోత్పత్తిని పెంచుకుంటాయి. ఈ సమయంలో ఆహార కొరత వీటిని బాధిస్తుంది. అందుకే మన పూర్వీకులు వీటి ఆహారం కోసం కొన్ని పద్ధతులు అనుసరించేవారు. ఖరీఫ్, రబీ కాలాల్లో వరి వెన్నుల (కంకులు)ను నైపుణ్యంతో తోరణాలు అల్లేవారు. ఒడుపుగా కుంచెలుగా కట్టేవారు. ఆలయాలు, పాఠశాలలు, ఇళ్ల లోగిళ్లలో వీటిని ఏర్పాటు చేసేవారు. పంట పొలాల్లో ఆహారం లభించని సమయాల్లో పక్షులు ఇక్కడికి వచ్చి వరి కుంచులు, తోరణాలపై వాలి ధాన్యపు గింజలను తినేవి. కలిసికట్టుగా వచ్చి సందడి చేస్తూ గింజలను తిని తిరిగి చెట్లకు చేరిపోయేవి. అప్పట్లో రైతులు తొలి పంటను కుంచెలుగా, తోరణాలుగా కట్టి దేవుళ్లకు నైవేద్యంగా పెట్టేవారు.

రానురానూ కనుమరుగు...

ఆధునిక కాలమాన పరిస్థితుల వల్ల పక్షులకు దారి లేకుండా పోయింది. ఉండటానికి అనువైన పరిస్థితులు కొరవడ్డాయి. సాధారణంగా ఇవి చెరువుగట్ల తుమ్మ చెట్లపైన, ఇంటికప్పుల కింద, పెంకుటింటి అడుగుభాగాన, పూరిళ్లు, మండువా ఇళ్ల వరండాల్లోని చూరుకింద గూళ్లు ఏర్పాటు చేసుకునేవి. అందులో గుడ్లు పెట్టేవి. వాటిని పొదిగేవి. పిల్లలు ఎగిరేవరకు అక్కడే పెద్ద పిచ్చుకలు కిలకిలాడుతూ తిరిగి సందడి చేసేవి. గుంపులుగా వాలడం, అలికిడి అవగానే తుర్రుమని ఎగడం వంటి దృశ్యాలు చూడముచ్చటగా కనిపించేవి. ఇప్పుడు ఆ వాతావరణం మచ్చుకైనా కనిపించడంలేదు. ఇంధ న, శబ్ద కాలుష్యం, ఇళ్ల నివాసాల్లో మార్పులు రావడం, అపార్టుమెంట్ల నిర్మాణం, ఆధునిక సాంకేతిక మార్పులతో పాటు సెల్ టవర్లు పిచ్చుకల జీవితాన్ని ధ్వంసం చేశాయి. జీవించేందుకు అవకాశం లేకుండా చేశాయి. ఫలితంగా రానురానూ వీటి సంతానం హరించుకుపోతోంది. పర్యావరణ పరిరక్షణకు.. ప్రకృతి సమతుల్యతకు పక్షులను కాపాడాల్సిన అవసరముందంటున్నారు పర్యావరణ హితేషులు.



పర్యావరణ హితానికి కలిసిరావాలి

తుని, కోటనందూరు, తొండంగి, నాతవరం, కోటవురట్ల, పాయకరావుపేట మండలాల్లోగల ఆలయాలు, పాఠశాలలు, ప్రముఖుల ఇళ్లలో కుంచులు, తోరణాలు, రింగు బుట్టలు కడుతున్నాం. కుమ్మరిలోవ, కొలిమేరులో కొంతమంది రైతులు, యువకులు, పూర్వ విద్యార్థుల సహకారంతో కుంచులు, తోరణాలు తయారీ చేస్తున్నాం. వేసవిలో కడితే ఖరీఫ్ పంటలు వరకు పిచ్చుకలకు ఆహారం లభిస్తుంది. పర్యావరణ పరిరక్షణకు రైతులు, దాతలు ముందుకురావాలి.

- పోలుపర్తి దాలినాయుడు, హరిత వికాస్ వ్యవస్థాపకుడు, తుని.



విశాఖ ఆర్గానిక్ మేళాలలో సందర్శకులకు వరి కుంచులు, తోరణాలు, రింగు బుట్టలపై అవగాహన కల్పిస్తున్న దాలినాయుడు మాస్టార్



సింహాచలం దేవస్థానంలో అర్చకులతో కలసి వరి కుంచులు కడుతున్న వైనం

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 25 వేల మంది
- దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షణ చేశారు. స్వామివారి వ్రతాలు 1,800 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదానపథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

వేసవి తాపంలో ఇక్కట్లు

ఈ ఏడాది మార్చి నెలలోనే భానుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో రత్నగిరిపై భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు ప్రధానంగా పశ్చిమ రాజగోపురం రోడ్డు ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. పశ్చిమ రాజగోపురం వద్ద భక్తుల కాళ్లు కాలకుండా రోడ్డుమీద పుట్ కార్పెట్ పరిచారు. కాగా ఎటువంటి నీడ లేకపోవడంతో అక్కడ చెట్ల నీడనే భక్తులు సేదతీరాల్సి వస్తోంది. ఇక్కడ షామియానాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



పశ్చిమ రాజగోపురం వద్ద ఎటువంటి షెల్టర్ లేకపోవడంతో చెట్ల నీడన సేద తీరుతున్న భక్తులు

వెనుకబడిన వర్గాలకు వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఆత్మీయ సమావేశంలో మంత్రి కారుమూరి



నిడదవోలులో నిర్వహించిన ఎమ్మెల్సీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

నిడదవోలు రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అధ్యక్షతన పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌లతో కలిసి నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్చి 13న జరగబోయే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తొలి ఎమ్మెల్సీ ఎస్సీ సామాజిక వర్గం నుంచి కొయ్యే మోషేనురాజుకు ఇచ్చి శాసనమండలి స్పీకర్ చేశారన్నారు. ఇప్పుడు బీసీ నుంచి కవురు శ్రీనివాస్‌కు, కాపు సామాజిక వర్గం నుంచి వంకా రవీంద్రనాథ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి సామాజిక న్యాయం పాటించారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ పార్టీలో నిబద్ధతతో పని చేసిన వారికి సీఎం జగన్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గానికి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును వంకా రవీంద్రనాథ్‌కు, ద్వితీయ ప్రాధాన్యత ఓటును కవురు శ్రీనివాస్‌కు వేయాలని సూచించారు. అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌లు మాట్లాడుతూ తమను ఎంపిక చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జెడ్పీటీసీలు కొయ్యే సూరిబాబు, కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీపీలు తిరుమళ్ల భాగ్యలక్ష్మి, కార్చెర్ల ప్రసాద్, పాలాటి యల్లారేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమల్లు సత్యనారాయణ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో తనిఖీలు

ఇన్‌చార్జి ఈఓగా చంద్రశేఖర్ అజాద్ బాధ్యతలు



అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ శనివారం బాధ్యతలు స్వీకరించే ముందు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మెట్లు ఎక్కి నేరుగా రత్నగిరికి చేరుకున్న ఆయన మెయిన్ క్యాంటీన్ సత్రం వద్ద పాత విద్యుత్ పరికరాలను అక్కడ నుంచి తీసేయమని ఆదేశించారు. క్యూలో వెళ్లి ప్రసాదం కొనుక్కుని తిన్నారు. అన్నదానం స్టోర్స్, ప్రసాదం విభాగం స్టోర్స్‌ను పరిశీలించారు. అక్కడ వృథాగా ఉన్న సామగ్రిని వేలం వేయాలని ఆదేశించారు. తరువాత ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం వైదిక కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన సింధు



సత్యదేవుని సన్నిధిలో పీవీ సింధు

అన్నవరం: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత పూసర్ల వేంకట సింధు శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న గ్లోబల్ ఇండస్ట్రియల్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆమె తిరుగుప్రయాణంలో అన్నవరంలో ఆగారు. ఆమెకు రత్నగిరిపై పండితులు ఘనంగా స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనం అనంతరం పండితులు వేదాశీస్సులు, స్వామివారి ప్రసాదాలు అందచేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ కూడా స్వామిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో అంబులెన్స్ వసతి

జగ్గంపేట: తమ గ్రామ ప్రజల అత్యవసర వైద్యసేవల కోసం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సొంత నిధులతో అంబులెన్స్ సౌకర్యం సమకూర్చారు. స్వగ్రామమైన ఇర్రిపాకలో అంబులెన్స్ సేవలను ఎమ్మెల్యే దంపతులు శనివారం ప్రారంభించారు. గ్రామం నుంచి గర్భిణులు, మరికొందరు అత్యవసర వైద్యసేవలు అవసరమైతే ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు చెప్పారు. ఇతర ప్రాంత ఆస్పత్రులకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని భావించామన్నారు. ఈ కారణంగానే అందరికి అందుబాటులో ఉండేలా అంబులెన్స్ వాహనాన్ని సమకూర్చామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఇర్రిపాక సర్పంచి దేవి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఆక్వారంగ పరిధిలోకి మరింత భూమి

కలెక్టర్ కె. మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం పెంచేందుకు రెండో దశ కింద 106 మంది రైతులకు చెందిన 229.09 ఎకరాలను ఆక్వాజోన్ పరిధిలోకి మార్చినట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. శనివారం సాయంత్రం తన ఛాంబర్ జిల్లా మత్స్యశాఖ అధికారి కేవీ కృష్ణారావు, ఇతర సమన్వయ శాఖల అధికారులతో కలిసి ఆమె రెండో దశ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్య రంగానికి మార్కెటింగ్ ప్రోత్సాహం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో సానుకూలంగా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఆక్వా రంగంలో ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని తొమ్మిది మండలాల్లోని 29 గ్రామాల్లో 1,197.02 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. మొదటి దశలో 967.93 ఎకరాలను నాన్ ఆక్వాజోన్ నుంచి ఆక్వా జోన్‌గా మార్చేందుకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదించిందన్నారు. తాజాగా రెండో దశలో 229.09 ఎకరాలను ఆక్వా జోన్ లోకి మార్చుతూ ఆమోదం తెలిపామన్నారు. ఇంకా జిల్లాలో 1529 ఎకరాలు నాన్ ఆక్వా జోన్ కింద ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. గ్రామ సభలో ఆమోదం పొందకపోవడం, గృహ సముదాయాలకు దగ్గర ఉండడం, తక్కువ విస్తీర్ణం, నిర్దిష్ట ప్రమాణాలు లేకపోవడంతో కొన్నింటికి అనుమతులు ఇవ్వలేదని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి కె వి కృష్ణారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవ రావు, జిల్లా పశుసంవర్థక అధికారి ఎస్ టి జి. సత్య గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా జయేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాలు



జయేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాలకు విచ్చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి

కొవ్వూరు: కంచి కామకోటి పీఠం 69వ అధిపతి జయేంద్ర సరస్వతి స్వామివారి ఆరాధనోత్సవాలు స్థానిక గోష్పాద క్షేత్రం కళావేదికలో శనివారం ప్రారంభమయ్యాయి. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుత పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పావన గోదావరి నదిలో స్నానమాచరించి క్షేత్రంలోని శంకరాచార్య స్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జయేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠంలో నిర్వహిస్తున్న చతుర్వేద యాగం పూజా కార్యక్రమాల్లోనూ విజయేంద్ర సరస్వతి పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న ఆరుగురి అరెస్టు

ఆలమూరు/రావులపాలెం: అక్రమ సంపాదన కోసం వివిధ గ్రామాల్లో గంజాయిని అమ్ముతున్న ఆరుగురిని ఆలమూరు, రావులపాలెం పోలీసులు శనివారం వేర్వేరుగా అరెస్టు చేశారు. జొన్నాడ శివారున గంజాయి నిల్వ ఉంచారనే సమాచారంతో రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు యువకులను అరెస్టు చేసి, 21 కేజీల గంజాయిని తహసీల్దార్ ఐపీ శెట్టి సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఇటుక బట్టీల్లో పని చేస్తున్న ఈ యువకులు దుర్వ్యసనాలకు బానిసలై, ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకువచ్చి మండలంలో విక్రయిస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రావులపాలెంలో..

రావులపాలేనికి చెందిన గోలి రిషికా అలియాస్ భవాని, విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువస్తోందని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. దీనిని ఆమెతో కలిసి మల్లిడి సందీప్‌రెడ్డి, తాడిశెట్టి కిషోర్‌లు స్థానికంగా విక్రయిస్తున్నారు. సమాచారం అందడంతో పోలీసులు పూరేటివారి చెరువు శివారున దాచి ఉంచిన రూ. 63 వేల విలువ చేసే 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురినీ అరెస్టు చేశారు.

పల్లె వాకిట తెలుగు దీపం

- భాషా సాహిత్య సేవల్లో పునీతం
- ఖ్యాతికెక్కిన ఆంధ్రి కుటీరం
- నేడు మధునాపంతుల జయంతి



మహాకవి మధునాపంతుల సత్య నారాయణశాస్త్రి


కాజులూరు: తెలుగు జాతి మనుగడకు సాహిత్యమే మూలాధారమని నమ్మి ఎందరో కవులు, రచయితలు సాహిత్య సేవ చేశారు.. చేస్తున్నారు. అటువంటి వారిలో అగ్రగణ్యులు కాజులూరు మండలం పల్లిపాలేనికి చెందిన మధునాపంతుల కుటుంబీకులు. సుమారు ఎనిమిది దశాబ్దాల క్రితం గ్రామంలో 'ఆంధ్రీ కుటీరం' పేరుతో ఒక సంస్థను స్థాపించి.. సమాజంలోని నిమ్నవర్గాల్లో విద్యా సుగంధాలు వెదజల్లారు. ఇప్పటికీ గ్రామంలోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య అందిస్తున్నారు. సమాజానికి తమ వంతు భాషా సేవ చేయాలనే లక్ష్యంతో 1939లో 'ఆంధ్రి' పేరుతో సాహిత్య మాసపత్రికను స్థాపించి.. దాని ద్వారా పలువురు కవుల సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. నేటికీ ఎందరో కవులు, రచయితలను సత్కరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఆంధ్రీ కుటీరం, ఆంధ్రీ పత్రిక వ్యవస్థాపకుడు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 103వ జయంతి మహోత్సవాలను ఆదివారం పల్లిపాలెంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఆ మహాకవి జీవిత విశేషాలివీ..

'ఆంధ్రీ' ఆవిర్భావం

గోదావరి తీరాన కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం సమీపంలోని ఓ చిన్న గ్రామం పల్లిపాలెం. చుట్టూ ఆకుపచ్చని తివాచీ పరచినట్టు పంట చేలు, మట్టి రోడ్డు పొడవునా మామిడి తోపులు, మొగలిపొదల పరిమళాలు.. నాగరిక వాసనలకు దూరంగా రమణీయంగా శోభించే ఆ పల్లె వాకిట్లో వెలసిన ఆ తులసికోట పేరే ఆంధ్రీ కుటీరం. సంప్రదాయ ప్రమిదలో సంస్కృతి చమురు పోసి, సాహిత్యపు ఒత్తి వేసి.. నాడు అక్కడ వెలిగించిన దీపం వజ్రోత్సవ కళతో నేటికీ చిరంతనంగా వెలుగులు విరజిమ్ముతూనే ఉంది. ఆ కుటీరం వెనుకన రసాల వృక్ష ఛాయలో కాళిదాస శాకుంతలంలోని శ్లోకాలు.. ద్రాక్ష తీగల పందిరి కింద కవిత్రయ భారతం, నందివర్ధనం చెట్టు నీడన నంది తిమ్మన పారిజాతాపహరణంలోని మధురమైన పద్యాలు ఏ భైరవిలోనో, కళ్యాణిలోనో వినిపించేవి. అక్కడకు వెళ్లి చూస్తే కడప రాతి పలకల మీద కూర్చుని బ్రహ్మవర్చస్సుతో కావ్య ప్రవచనం చేసి ఓ శ్రోత్రియ యువకవి కనిపించేవారు. ఆ సాహితీ తేజోమూర్తే అనంతర కాలంలో ఆంధ్ర పురాణాది కావ్యాలను విరచించిన కళాప్రపూర్ణుడు, ఆంధ్ర కల్హణుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి. 1920 మార్చి 5వ తేదీన ఐ.పోలవరం గ్రామంలోని మాతామహుడు ఆకొండి రామ్మూర్తి శాస్త్రి ఇంట ఆయన జన్మించారు. తల్లిదండ్రులు లచ్చమ్మ, సత్యనారాయణమూర్తి. పల్లిపాలెం, ఇంజరం, విజయనగరాల్లో ఆయన విద్యాభ్యాసం జరిగింది. చిన్నతనం నుంచే మధునాపంతుల వారు కావ్య వ్యాకరణాలు ఔపోసన పట్టారు. తాను నేర్చిన సాహిత్య జ్ఞాన సంపదను గ్రామ సీమల్లోని జిజ్ఞాసువులకు పంచాలనే ఏకైక లక్ష్యంతో 1938 జనవరి 13న 'ఆంధ్రీ కుటీరం' అనే సంస్థను ఆయన స్థాపించారు. హరిజనులకు సైతం ప్రాచీన కావ్య సంపద, తెలుగు, సంస్కృత భాషలను బోధించాలనే అభ్యుదయ భావంతో.. వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పించి తమ కుటీరంలో చదువు నేర్పారు. అనంతర కాలంలో వారిలో చాలామంది ఉపాధ్యాయులుగా, పలు ఉద్యోగాల్లో స్థిరపడి మంచి పేరు గడించుకున్నారు.



పల్లిపాలెంలోని ఆంధ్రీ కుటీరం



ఆంధ్రీ కుటీరం వద్ద మధునాపంతుల ఆంధ్ర పురాణం రచించిన ప్రాంతం



మధునాపంతుల కుటుంబీకులు నిర్వహిస్తున్న ఉచిత పాఠశాల



1939 నాటి ఆంధ్రి పత్రిక తొలి సంచిక

ఆంధ్రి పత్రిక ఆరంభమైందిలా..

సమాజానికి తనవంతు భాషా సేవ చేయాలనే తలంపుతో సాహిత్య మాస పత్రికను ప్రారంభించాలన్నది శాస్త్రిగారి లక్ష్యం. ఎలాంటి సదుపాయాలూ లేవు. కనీసం పోస్టు అందుకోవాలన్నా రెండు కిలో మీటర్లు వెళ్లాలి. కరెంటు వంటి సౌకర్యాల ఊసే లేదు. కానీ పత్రిక రావాలి. ఇదీ ఆయన ప్రబల ఆకాంక్ష. 1929 మార్చి 22– ప్రమాది ఉగాదిన ఆంధ్రీ కుటీర తొలి వార్షికోత్సవం జరిగింది. అదే రోజు వేదుల రామమూర్తి అధ్యక్షతన ఆంధ్రి పత్రిక ఆవిర్భవించింది. దేశంలోని ప్రసిద్ధ కవి పండితులు తమ రచనలతో ఈ పత్రికను ఆశీర్వదించారు. ఎందరో సాహితీమూర్తులు కవితలు, వ్యాసాలు పంపేవారు. ఉద్యోగ రీత్యా శాస్త్రిగారు 1947లో రాజమండ్రి వెళ్లాల్సి వచ్చింది. అనంతరం కుటీర బాధ్యతలను ఆయన సోదరుడు మధునాపంతుల సూరయ్యశాస్త్రి స్వీకరించారు. అన్నగారి బాటలోనే స్థానిక మిత్రుల సహకారంతో ఆంధ్రీ కుటీరాన్ని కొనసాగించారు. వేసవి సెలవులు, ఇతర సందర్భాల్లో కుటీరానికి మధునాపంతుల వచ్చేవారు.

వర్తమానం

ఆంధ్రీ కుటీరం 1980వ దశకంలో కొత్త కొమ్మలు, రెమ్మలతో విరబూసింది. నవతరం నిర్వహణలోకి వచ్చింది. అటు సంప్రదాయ పథం – ఇటు నవీన పంథా ఆంధ్రీకి నవ్యోత్సాహాన్నిచ్చాయి. సూరయ్య శాస్త్రి పర్యవేక్షణలో వారి తనయుడు సత్యనారాయణమూర్తి నిర్వహణ బాధ్యతలు స్వీకరించారు. కోలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పని చేస్తూ, అనువంశిక ఆయుర్వేద వైద్యం నిర్వహిస్తూ కుటీరాన్ని, సాహిత్య సేవను కొనసాగిస్తున్నారు. 2011లో 'మధుశ్రీలు' పుస్తకావిష్కరణ సందర్భంగా పల్లిపాలెంలో అద్దేపల్లి రామమోహనరావు అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధ కవులందరూ హాజరయ్యారు. నేటికీ ఏటా మధునాపంతుల జయంతి సభలను ఆంధ్రీ కుటీరం నిర్వహిస్తోంది.

వాడపల్లి.. భక్తజన గోదారి



వేంకటేశ్వరుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి భక్తజన గోదారిని తలపించింది. ఇక్కడి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. వివిధ సేవలు, ప్రసాద విక్రయాలు, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.15,18,300 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్య నారాయణరాజు తెలిపారు.

'రంగరాయ'కు 48 కొత్త పీజీ సీట్లు

- రాష్ట్రంలోనే తొలిగా హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఏర్పాటు
- సీట్లే లేని మరో రెండు డిపార్ట్‌మెంట్లకు 9 మంజూరు



కాకినాడ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం చొరవతో రాష్ట్రంలో మరే వైద్య కళాశాలకూ దక్కని అరుదైన ప్రాధాన్యం కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీకి దక్కింది. తాజాగా జరిగిన ఇన్‌స్పెక్షన్‌లో కళాశాల స్థాయిని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) గుర్తించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం సిఫారసు మేరకు నూతన విభాగాల ఏర్పాటుకు పూర్తి స్థాయి అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిరకాలం నుంచి ఖాళీగా ఉన్న సైకియాట్రీ, రేడియోథెరపీ డిపార్ట్‌మెంట్లలో 9 పీజీ సీట్లకు అనుమతి ఇచ్చింది. అలాగే నూతన డిపార్ట్‌మెంట్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌కు కూడా అనుమతి ఇస్తూ 5 పీజీ సీట్లు కేటాయించింది. కళాశాలను ఫిబ్రవరి 1న ఎన్ఎంసీ సందర్శించింది. బోధకుల సంఖ్య, బోధన సమర్థత, వారి అనుభవం, విద్యనభ్యసించేందుకు అందుబాటులో ఉన్న, కొత్తగా ఏర్పాటైన, అభివృద్ధి చెందుతున్న మౌలిక వసతులు, బోధనలో అనుసరిస్తున్న విధానాలు, ఇతర అంశాలను పరిగణిస్తూ ఇచ్చిన ఎసెస్సర్ నివేదిక ఆధారంగా.. మెడికల్ ఎసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు (ఎంఏఆర్‌బీ) తాజాగా పీజీ సీట్ల కేటాయింపు, పెంపుదలకు అనుమతిచ్చింది. రంగరాయ వైద్య కళాశాల చరిత్రలో ఈ స్థాయిలో పీజీ సీట్లు పెరగడం ఇదే తొలిసారి కావడంతో వైద్య వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. నిర్ణీత 15 విభాగాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం వినతితో ఎన్ఎస్‌సీ పరిశీలనకు సిద్ధమైంది. వాటిలో 12 డిపార్టుమెంట్లలో ఇన్‌స్పెక్షన్ పూర్తి చేసి, 48 సీట్లు కేటాయించింది. మరో మూడు డిపార్టుమెంట్లలో త్వరలోనే ఇన్‌స్పెక్షన్ పూర్తి కానుంది. అనంతరం అదనంగా మరిన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది.

రంగరాయ వైద్య కళాశాలలో ఇప్పటికే 150 పీజీ సీట్లు ఉండగా.. తాజా కేటాయింపులతో అవి 198కి చేరాయి.

డిపార్టుమెంట్	ప్రస్తుత పీజీ సీట్లు	కొత్తగా కేటాయించినవి	మొత్తం
హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్	0	5	5
సైకియాట్రీ	0	4	4
రేడియోథెరపీ	0	5	5
పేథాలజీ	6	8	14
మైక్రోబయాలజీ	6	4	10
ఫోరెన్సిక్ మెడిసిన్	3	2	5
ఆర్థోపెడిక్	5	8	13
ఈఎన్‌టీ	6	2	8
ఆప్తాల్మాలజీ	9	4	13
రేడియో డయాగ్నొసిస్	4	3	7
న్యూరో సర్జరీ	2	4	6